# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

గురువారం | 26 ఫిబ్రవరి, 2026 | పేజీలు :06


# లక్ష్యానికి చేరువలో రుణాల పంపిణీ

**ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ 2025 నుండి డిసెంబర్ 2025 వరకు రూ.11358.47 కోట్ల రుణాలు మంజూరు : జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



**ప్రజాపక్షం/కరీంనగర్ :** జిల్లా కేంద్రం లోని కెడిసిసిబి సమావేశం మందిరంలో బ్యాంకర్లు, జిల్లా అధికారులతో రైతులకు రుణాల పంపిణీ, స్వయం సహాయక సంఘాల రుణాలు, రికవరీ, పీఎం జి.పి.వై. రుణాలు, ఎస్సీ, బిసి, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖల పథకాలకు సంబంధించి రుణ లక్ష్య పురోగతిపై డిసిసి, డిఎల్ఆర్‌సి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుండి డిసెంబర్ వరకు 84.55 రుణాలను పంపిణీ చేసినందుకు బ్యాంకర్లందరినీ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో వివిధ ఆర్థిక మద్దతు పథకాల లక్ష్యసాధనకు రుణాలు అందించడంలో బ్యాంకర్లు పూర్తిస్థాయిలో సహకరించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి బ్యాంకర్లను కోరారు. వివిధ ఆర్థిక మద్దతు పథకాలకు సంబంధించి వంద శాతం లక్ష్యసాధనకు బ్యాంకర్లు, ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. రైతులు తమ రుణాలను రెన్యూవల్ చేసుకునే అంశంపై వారికి అవగాహన కల్పించాలని, జిల్లాలో వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ బ్యాంకర్లు ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని తెలిపారు. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశానుసారంగా ఫైనాన్షియల్ ఇంక్లూషన్‌లో తరువాయి 2లో

# బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించాలి

**జిల్లాను మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి**

**రోడ్డు ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు : జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

**ప్రజాపక్షం/ నిర్మల్ కలేక్టరేట్ :** జిల్లాలో బాల్యవివాహాలు, మాదక ద్రవ్యాల వినియోగం,రోడ్డు ప్రమాదాలు వంటి సామాజిక సమస్యలను సమూలంగా నిర్మూలించేందుకు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి మాదక ద్రవ్యాల నిర్మూలన, బాల్యవివాహాల నివారణ, లింగ నిర్ధారణ పరీక్షల నిషేధం అమలు, రహదారి భద్రత,బాల కార్మికుల సంరక్షణ, మున్సిపల్ అంశాలపై సమీక్ష నిర్వహించారు.

**బాల్యవివాహాలపై కఠిన చర్యలు..**

గత సంవత్సరం 45,ఈ ఏడాది ఇప్పటివరకు 2 బాల్యవివాహాలను అడ్డుకున్నామని కలెక్టర్ తెలిపారు. బాల్యవివాహాల సమాచారం అందిన వెంటనే సంక్షేమ, పోలీసు, విద్యాశాఖలు సమన్వయంతో వెళ్లి తరువాయి 2లో






# నగర పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

**స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంకు కోసం కృషి**

**నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**

**ప్రజాపక్షం/కరీంనగర్ :** నగర పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి, స్వచ్ఛ్ సర్వేక్షన్ 2026లో మెరుగైన ర్యాంకు కోసం కృషి చేస్తామని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి పారిశుధ్య విభాగం అధికారులతో మేయర్ కొలగాని శ్రీనివాస్ మొదటి సారిగా సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో నగర పారిశుధ్యం మెరుగు, స్వచ్ఛ్ సర్వేక్షన్ 2026 ర్యాంకు డివిజన్ వారిగా చేపట్టే కార్యక్రమాలు, పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన, వంద శాతం చెత్త సేకరణ, సెగ్రిగేషన్ ప్రక్రియ, డీఆర్ సీసీల నిర్వహణ, జీవిపి పాయింట్స్ నిర్వహణ, ట్రేడ్ లైసెన్, పారిశుధ్యంలో యంత్రాల వినియోగం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. పారిశుధ్యం నిర్వహణపై కమీషనర్, మేయర్ పలు సలహాలు, సూచనలు చేస్తూ, ఆదేశాలు జారీ చేశారు. పారిశుధ్య విభాగం నిర్వహణ తీరుపై పత్రికల్లో వస్తున్న కథనాలకు మేయర్ కొలగాని శ్రీనివాస్ స్పందించారు. వస్తున్న కథనాల అంశంపై విచారణ చేయించి, చర్యలు తీసుకోవాలని కమీషనర్ ప్రఫుల్ దేశాయ్‌కి సూచించారు. ఈ సంధర్బంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బంది ఎలాంటి అవినీతికి పాల్పడినట్లు మా దృష్టికి వస్తే, కఠినచర్యలు తీస్కుంటామని హెచ్చరించారు. నగర పారిశుధ్యం పనుల్లో అధికారులు సిబ్బంది, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. అధికారులు సిబ్బంది సమయపాలన పాటించి, ఉదయమే ఫీల్డ్ లో ఉండాలన్నారు. 2026 స్వచ్ఛ్ సర్వేక్షన్‌కు సంబంధించి డివిజన్ వారిగా చేపట్టాల్సిన కార్యక్రమాలను చేపట్టి, తరువాయి 2లో

# నృసింహుడి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

**రేపటినుండి 13 రోజుల పాటు ఉత్సవాలు**

**ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు**




**ప్రజాపక్షం/ధర్మపురి :** సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మి నృసింహస్వామి, శ్రీ వెంకటేశ్వర స్వామి వారల వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 27 నుండి మార్చి 11 వరకు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. శుక్రవారం సాయంత్రం 6గంటలకు పుట్ట బంగారం సేకరణ కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. జాతర జరుగు 13రోజుల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని దేవాదాయ శాఖ, మున్సిపల్ అధికారులతో పాటు ఇతర శాఖల అధికారులను ధర్మపురి తరువాయి 2లో

## పుష్కరాల్లో భక్తులకు లోటు లేకుండా

# తగిన సౌకర్యాలు : కలెక్టర్



వివరాలు మెయిన్‌లో...

## నగర పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. స్వచ్ఛ్ సర్వేక్షన్ మెరుగైన ర్యాంకు కోసం అధికారులు సిబ్బంది కృషి చేయాలని ఆదేశించారు. మరోవైపు కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, పెండింగ్ ట్రేడ్ లైసెన్స్ పూర్తి చేయాలని, ట్రేడ్ లైసెన్స్ పన్నులు వసూలు చేయాలన్నారు. నగర పరిశుభ్రతపై దృష్టి సారించాలని, ఎక్కడ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీస్కోవాలన్నారు. స్వచ్ఛ్ సర్వేక్షన్ పోటికి సంబంధించి ఆక్టివిటీస్ ప్రారంభించి, పారిశుద్ధ్య కార్యక్రమాలపై డివిజన్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వీల్డ్‌లో సమయపాలన తప్పక పాటించి డివిజన్ల వారిగా పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమీషనర్ దిలీప్ కుమార్, ఎంహెచ్ ఓ సుమన్, సూపర్ వైజర్లు, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

## లక్ష్యానికి చేరువలో రుణాల పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

భాగంగా 09.02. 2026 నుండి 13.02.2026 వరకు కెవైసి సురక్షిత బ్యాంకింగ్‌కు మీ తొలి అడుగు నినాదముతో కరీంనగర్ జిల్లాలో సభలను నిర్వహించి బ్యాంకులు అవగాహన సదస్సులు నిర్వహించారని తెలియజేశారు. ఎస్ హెచ్ జి గ్రూపు సభ్యులందరూ తాము బ్యాంకర్ల నుండి తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకొని వ్యాపార అభివృద్ధికై ఉపయోగించాలని మరియు రుణాలను సకాలంలో తిరిగి చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఎల్డిఎం ఆంజనేయులు, ఆర్బిఐ ఎల్‌డిఓ యశ్వంత్, డిడిఎం ఎస్. జయప్రకాశ్ నా బార్డ్, ఎస్బిఐ ఏజిఎం వెంకటేష్, యుబిఐ ఏజిఎం, టీజీబీ ఆర్ఎం బాల నాగు, కెడీసీసీబీ సిఈఓ సత్యనారయణ, అన్ని బ్యాంకుల కంట్రోలర్స్, కోఆర్డినేటర్స్ కరీంనగర్ లోకల్ బ్రాంచ్ మేనేజర్స్, డిఎఓ, జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎమ్, డిడబ్ల్యూఓ సరస్వతి, అడిషనల్ డిఆర్డిఏ సునీత, డిఆర్‌డిఓ, పిడి మెప్మా పాల్గొన్నారు.

## పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

**ప్రజాపక్షం/తానూర్ :** పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈఓ నరేందర్ అన్నారు.మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధువారం మండల పదవ తరగతి, విద్యార్థులకు మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, పేరణాత్మక వక్త పెంటాజి, భూమన్న యాదవ్, ద్వారా మోటివేషన్ క్లాస్, నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ.. వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున ఒక ప్రణాళిక ప్రకారం చదవాలని, సూచించారు. సులభంగా ఏ విధంగా ఉత్తీర్ణులు కావడం, అత్యధిక మార్కులు ఏ విధంగాఆ సాధించాలని అంశాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఆయా జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

# నృసింహుడి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్యే,రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్‌లు ఆయా శాఖల బాధ్యులను ఆదేశించారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు యుద్ధప్రాతిపదికన పూర్తి అవుతున్నాయి. గోదావరి నది తీరంలో భక్తు లకు నీడ వసతితో పాటు స్త్రీలు బట్టలు మార్చుకునేందుకు ప్రత్యేక గదులు,బయో టాయిలెట్స్, విద్యుత్ ఏర్పాట్లు పూర్తి చేశారు. ట్రాఫిక్ క్రమబద్దీకరణ,వాహన పార్కింగ్ కోసం అన్ని చర్యలూ చేపట్టారు. పురపాలక సంఘం పక్షాన 150 మందితో పారిశుధ్య పనులు ముమ్మరంగా నిర్వహించనున్నారు. ఇటు దేవస్థానం పక్షాన ఆలయం లోపల, వెలుపల ప్రత్యేక క్యూలైన్లు పూర్తి చేశారు. భక్తులకు శుద్ద జలాన్ని సరఫరా చేయడానికి చర్యలు తీసుకున్నారు. ఈనెల 28న జరిగే ముప్పురు స్వాముల కళ్యాణ మహోత్సవ కార్యక్రమ వేదిక స్థలంలో పనులు వేగంగా సాగుతున్నాయి. స్థానిక రైస్ మిల్లర్లు, వ్యాపారుల సహకారంతో 13 రోజుల పాటు ఉచిత అన్నదానానికి దేవస్థానం పక్షాన ఓల్డ్ టీటీడీ కళ్యాణమంటపంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలీస్ శాఖ నుండి జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాలతో డిఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో ధర్మపురి సిఐ రాం నర్సింహా రెడ్డి, ఎస్సైలు గురుక మహేష్, మిర్యాల రవీందర్‌లు ప్రత్యేక పోలీసు బలగాలతో అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా బందోబస్తు చర్యలు తీసుకోనున్నారు. టీఎస్ ఆర్టీసి నుండి వివిధ డిపోల నుండి ధర్మపురి క్షేత్రానికి ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. ముఖ్యంగా 28న జరిగే ముప్పురు స్వాముల కళ్యాణ మహోత్సవానికి భారీ సంఖ్యలో భక్తులు, వీవీఐపిలు తరలిరానున్న నేఫథ్యంలో అవసరమైన చర్యలు చేపట్టారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌లు అన్ని శాఖల అధికారులను సమన్వయంతో ముందుకు వెళ్లి ఉత్సవాలు విజయవంతం చేయాలని ఆదేశించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు జక్కు రవీందర్, దేవస్థానం ఈవో సంకటాల శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్రీనివాసరావు, ధర్మపురి సిఐ రాంనర్సింహరెడ్డి తదితరులు ఇప్పటికే పలుమార్లు క్షేత్రస్థాయిలో కావాల్సిన ఏర్పాట్లపై చర్చించారు.

# బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించాలి

(మొదటి పేజీ తరువాయి)

అడ్డుకోవాలని ఆదేశించారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి, నిర్ణీత వయస్సు వచ్చే వరకు వివాహం జరపబోమని ధృవీకరణ పత్రాలు తీసుకోవాలన్నారు.బాల్యవివాహాలను పోత్సహించిన వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బాలబాలికలకు విద్యను అందించడంతో పాటు పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.జిల్లాలో చేపట్టిన చర్యలు రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందినట్లు పేర్కొన్నారు.

**మాదక ద్రవ్యాల నిర్మూలన..**

జిల్లాను మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఆదేశించారు. గంజాయి, నాటు సారా వంటి నిషేదిత పదారాలపై ప్రత్యేక దృష్టి సారించి కేసులు నమోదు చేయాలన్నారు. విద్యాసంస్థల్లో మత్తు పదార్థాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలని సూచించారు.

**రహదారి భద్రత..**

జిల్లాలో ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రదేశాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని చెప్పారు. జీబ్రా క్రాసింగ్‌లు, రంబుల్ స్ట్రిప్స్, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

**బాల కార్మికుల నిర్మూలన..**

ఆపరేషన్ ముస్కాన్ కింద బాల కార్మికులను గుర్తించి సంరక్షణ కల్పించాలని సూచించారు.రక్షించిన పిల్లలను విద్యాసంస్థల్లో చేర్పించి పునరావాసం కల్పించాలని,బాల కార్మికులను నియమించిన యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**లింగ నిర్ధారణ పరీక్షల నిషేధం..**

జిల్లాలో స్కానింగ్ కేంద్రాలు, రోగ నిర్థారణ కేంద్రాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని వైద్యశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే వారిపై పీసీ, పిఎన్‌డీటీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అనధికార ఆర్‌ఎంపీలను గుర్తించి, ప్రథమ చికిత్సకు మించి చికిత్సలు చేయకుండా నియంత్రించాలని సూచించారు. అలాగే అన్ని మున్సిపాలిటీల్లో వీధిదీపాల సమస్యల లేకుండా చూడాలని, మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ,బాల్యవివాహాల నిరోధంలో పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మాదక ద్రవ్యాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక డ్రైవ్‌లు కొనసాగుతున్నాయని చెప్పారు. సమాచారం అందిన వెంటనే స్పందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం బాలవివాహ ముక్త భారత్ కార్యక్రమానికి సంబంధించిన గోడప్రతులను కలెక్టర్, ఎస్పీ తదితరులు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

### పరీక్షలకు సంసిద్ధం చేయండి

### అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే



**ప్రజాపక్షం/కరీంనగర్ :** వచ్చే నెల 14 నుండి పదవ తరగతి పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ ఉంచాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే ఉపాధ్యాయులకు సూచించారు. చింతకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం అడిషనల్ కలెక్టర్ సందర్శించి 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలు సమీపిస్తున్నందున రోజు విధిగా పాఠశాలకు రావాలని, ఉపాధ్యాయులతో సందేహాలు నివృత్తి చేసుకుంటూ పరీక్షలకు సిద్ధం కావాలని విద్యార్థులకు సూచించారు. మోడల్ పరీక్ష జవాబు పత్రాలను పరిశీలించి విద్యార్థుల ప్రగతిని తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థితో మాట్లాడి వెనుకబడిన సబ్జెక్టుపై ఎక్కువ శ్రద్ధ పెట్టాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుంటూ ప్రత్యేక తరగతులకు హాజరై పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి చదివించాలని సూచించారు. 100 శాతం మంది ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. అడిషనల్ కలెక్టర్ వెంటా విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, మండల విద్యాధికారి ఆనందం, ప్రధానోపాధ్యాయులు శోభారాణి పాల్గొన్నారు.

## కౌలు రైతులను ఆదుకోవాలి



**ప్రజాపక్షం/బైంసా :** భారీ ఈదురు వర్షాలతో నష్టపోయిన రైతులను కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బిజెపి బైంసా మండల అధ్యక్షురాలు దేగాం సర్పంచ్ సిరం సుష్మ రెడ్డి అన్నారు. దేగాం గ్రామంలో వ్యవసాయ అధికారులతో కలిసి నష్ట పోయిన పంటను పరిశీలించిన సందర్బంగా ఆమె మాట్లాడారు. ఎకరానికి 25 వేల రూపాయలు చెల్లించి మొక్కజొన్న పంట వస్తే ప్రకృతి కన్నెర్ర జేయడంతో రైతులు తీవ్రంగా నష్ట పోయారు. బాధిత రైతులకు పరిహారం ఇవ్వాలని కౌలు రైతుల కష్టాన్ని గుర్తించాలన్నారు. గతంలో వర్షాలతో నష్టపోతే ప్రభుత్వం పరిహారం ఇవ్వలేదన్నారు. ఇకనైనా రైతులను అదుకోవాలని కోరారు.

## డ్రగ్స్‌తో కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలి

### అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

### మాదక ద్రవ్యాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై అదనపు ఎస్పీ చంద్రయ్య, అధికారులతో కలిసి సమీక్ష

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జిల్లాలో డ్రగ్స్, మాదక ద్రవ్యాలతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. జిల్లాలో మాదక ద్రవ్యాల, డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టిన చర్యలపై అదనపు ఎస్పీ చంద్రయ్యతో కలిసి సంబంధిత అధికారులతో జిల్లాస్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సము దాయంలో బుధవారం నిర్వహించారు. జిల్లా నార్కోటిక్ కంట్రోల్ సమావేశంలో జిల్లాలో నమోదవుతున్న ఎన్డీపీఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాదక ద్రవ్యాల నియంత్రణ చర్యలు, మాదక ద్రవ్యాల నివారణ కోసం శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై విస్తృత ప్రచారం వంటి పలు అంశాలపై చర్చించారు. అనంతరం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ, మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి ఆరోగ్య చికిత్స, కౌన్సిలింగ్ అందించేలా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. డ్రగ్స్, గంజాయితో కలిగే ఇబ్బందులపై యువత, విద్యార్థులకు ఎక్సైజ్, వైద్య ఆరోగ్య శాఖ సంయుక్తంగా అవగాహన కల్పించాలని సూచించారు. అదనపు ఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి అరికట్టేందుకు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, ఎక్సైజ్ అధికారి శ్రీనివాసరావు, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్, ఫుడ్ ఇన్స్పెక్టర్ అనూష, తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

### పరీక్ష కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ మహేష్ బిగితే

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల:** జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 16 పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే తెలిపారు. గురువారం ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు పురస్కరించుకొని సిరిసిల్ల పట్టణ కేంద్రంలోని జూనియర్ కలశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని జిల్లా ఎస్పీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పరీక్ష కేంద్రాల పనితీరును పరిశీలించారు. కేంద్రాల వద్ద విధుల్లో ఉన్న పోలీస్ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరీక్షలు సజావుగా, ఏలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేయకుండా బిఎన్‌ఎస్ఎస్ (సెక్షన్ 144) అమలులో ఉంటుందని స్పష్టం చేశారు.పరీక్షల సమయంలో కేంద్రాల పరిసర ప్రాంతాల్లో నిరంతర పెట్రోలింగ్ నిర్వహించాలని,ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు పరీక్షా కేంద్రాల వద్ద గుమికూడ కుండా చూడలన్నారు. పరీక్షా కేంద్రం నుండి 200 మీటర్ల పరిధిలో ఉన్న జిరాక్స్ సెంటర్లు ఉదయం 08:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు మూసి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి నిబంధనలు కచ్చితంగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఎస్పీ వెంట పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ సిబ్బంది ఉన్నారు.

## ప్రమాద హెచ్చరిక బోర్డు ఏర్పాటు



**ప్రజాపక్షం/బైంసా :** బైంసా పట్టణంలోని బస్ డిపో సమీపంలో ఉన్న గడ్డేన వాగు వంతెనపై ప్రమాద హెచ్చరిక బోర్డును పోలీసు శాఖ ఏర్పాటు చేసింది.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ. కొన్ని రోజుల క్రితం ఇదే వంతెనపై ప్రమాదం జరిగి నలుగురి మృతి చెందడం జరిగింది.ఈ ప్రమాద ఘటనను దృష్టిలో ఉంచుకొని, ఇకపై ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. కావున వాహనదారులు ఈ వంతెన ప్రాంతంలో వేగాన్ని తగ్గించాలని, ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని, అప్రమత్తంగా డ్రైవింగ్ చేయడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు.

## ఇంటర్ మొదటి రోజు పరీక్ష ప్రశాంతం

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** జిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు మొదటి రోజు బుధవారం ప్రశాంతంగా జరిగాయని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కల్పన ఒక ప్రకటనలో తెలిపారు.మొదటి రోజు ఇంటర్ మొదటి సంవత్సరం తెలుగు, హిందీ, ఉర్దూ భాష పరీక్షలు జరిగాయని, ఈ పరీక్షకు (5419) మంది హాజరు కావాల్సి ఉండగా, (5271) మంది హాజరు కాగా, (148) మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని, తొలి రోజు 97 శాతం హాజరు నమోదు కావడం జరిగిందని, మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఇంటర్మీడియేట్ జిల్లా అధికారి కల్పన తెలిపారు.

## పేదింటి బిడ్డ పెళ్లికి ఆర్థికసాయం

**ప్రజాపక్షం/ముత్తారం :** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం పేదింటి బిడ్డ వివాహం జరిగినట్లయితే 10 వేల 116 రూపాయలు అందిస్తానని ఇచ్చిన హామీ మేరకు పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు గ్రామానికి చెందిన నాగుల మల్యాల లక్ష్మి రవీందర్ కూతురు వావిలాల గ్రామంలో హేమలత వివాహం బుధవారం జరిపించగా ఈ వివాహ వేడుకలకు ముఖ్య అతిథిగా సర్పంచ్ కవిత కిషన్ రెడ్డి హాజరై 10116 రూపాయలు అందించి నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వెంట ఉప సర్పంచ్ దాసరి ప్రశాంత్ గౌడ్, బొమ్మిడి మల్లేష్, షేర్ స్వామి, ఎర్రబెల్లి పాపారావు, రవి గౌడ్, సదనందం, బిక్కినేని సుధాకర్ రావు, ఐలాపురం కుమారస్వామితో పాటు తదితరులున్నారు.

## మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలపై విన్నపం



**ప్రజాపక్షం/ మల్లాపూర్ :** జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షుడు పిట్ల శ్రీధర్ ను మల్లాపూర్ మండలానికి చెందిన వడ్డెర సంఘం జిల్లా నాయకుడు బోదాసు శేఖర్ మహేష్ హరీష్‌లు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంచిర్యాల పర్యటనకు వెళ్తున్న జాతీయ అధ్యక్షుడు శ్రీధర్ ను మార్గమధ్యలో కలిసి వడ్డెర కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై విన్నవించినట్లు తెలిపారు. వీరి వెంట వడ్డెర సంఘం రాష్ట్ర జిల్లా నాయకులు తదితరులున్నారు.

## ఆడపడుచు కల్యాణానికి పట్టుచీర కానుక

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** వాల్గొండా గ్రామానికి చెందిన పల్లికొండ తులసి కల్యాణం బుధవారం జరగగా శ్రీ రామలింగేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ పందిరి నాగరాజు ఆడపడుచు కానుకగా పట్టుచీరను అందించారు. బుధవారం జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించి కానుకను అందజేశారు. నేటినుండి గ్రామంలో జరిగే ప్రతి ఆడపడుచు పట్టు చీర కానుకగా అందించినట్లు తెలిపారు. ఇరివెంట గ్రామస్తులు, తదితరులున్నారు.

# మున్సిపల్ ఎన్నికల టికెట్ల కేటాయింపులో ఫిర్యాదు



**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** మున్సిపల్ ఎన్నికల సం దర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి టికెట్ల కేటాయింపులో పాల్పడిన అవకతవకలు, పార్టీ నిధులను దుర్వినియోగం తదితర విషయాలపై పలు ఆధారాలతో లిఖితపూర్వకంగా తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ను జగిత్యాల బిజెపి నేతలు బుధవారం హైదరాబాదులో కలిసి ఫిర్యాదు చేశారు. ఎంపీ ధర్మపురి అరవింద్ అండదండలతో పార్టీని జగిత్యాలలో తన సొంత జాగీరుగా భావిస్తూ గత నలభై సంవత్సరాలుగా ఎన్నో కష్టనష్టాల కోర్చి పార్టీని కాపాడుకుంటూ వస్తున్న సీనియర్ నాయకులను, కార్యకర్తలను అవమానాలకు గురిచేస్తూ పార్టీకి తీవ్ర నష్టం కలిగిస్తున్నారని జగిత్యాల బిజెపి నేతలు రాష్ట్ర అధ్యక్షుడికి వివరించారు. జగిత్యాల మున్సిపల్ ఎన్నికల సమయంలో గెలిచే అభ్యర్థులకు టికెట్లు ఇవ్వకుండా సర్వే పేరుతో కట్టుకథలు చెప్పి తమ అనుయాయులకు టికెట్లు కేటాయించరని వారు వివరించారు. అయితే తాను కేటాయించిన టికెట్లు ఎవరికి కూడా డిపాజిట్ దక్కలేదని జగిత్యాల బీజేపీ నేతలు రాష్ట్ర అధ్యక్షులు దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపల్ ఎన్నికల కోసం రాష్ట్ర పార్టీ కేటాయించిన డబ్బుల్లో కార్యకర్తలకు ఇవ్వకుండా సుమారు కోటి రూపాయల వరకు అవకతవకలకు పాల్పడ్డారని అన్ని విషయాలపై సమగ్ర విచారణ జరిపి భోగ శ్రావణి పై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అధ్యక్షునికి బీజేపీ నేతలు కోరారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షున్నీ పూల బొకేతో శాలువాతో సత్కరించారు. రాష్ట్ర అధ్యక్షుడుని కలిసిన వారిలో బిజెపి రాష్ట్ర నాయకుడు ముదుగంటి రవీందర్ రెడ్డి, బిజెపి రెబల్ కౌన్సిలర్లు అరవ లక్ష్మి ఎసిఎస్ రాజు, వరలక్ష్మి శ్రీనివాస్, సీనియర్ నాయకులు చంద్రశేఖర రావు, సుగుణాకర్ రావు, రవీందర్, సుధాకర్, భగవంత రావు, శ్రీనివాస్, సురేష్, ప్రమోద్, సతీష్, బిట్టు తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు వైద్య పరీక్షలు



**ప్రజాపక్షం/రాయికల్ :** మండలంలోని భూపతిపూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జగిత్యాల శాఖ ఆధ్వర్యం లో బుధవారం 115మంది బాలికలకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనీమియా తో బాధపడుతున్న 73 మంది బాలికలకు నెలకు సరిపడ మందులు మరియు సానిటరి ప్యాడ్స్ పంపిణీ చేశారు.అనంతరం బాలికలకు వారి ఆరోగ్యంను ఎలా కాపాడుకోవాలో,రక్త హీనత ఎలా వస్తుందనే విషయాలను డాక్టర్లు సూచించారు.ఈ కార్యక్రమం లో డా. హేమంత్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జగిత్యాల అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ అచ్యుత్ మరియు పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ సాహితీ, గ్రామ సర్పంచ్ గుర్రం భావన మహేందర్, మాజీ సర్పంచ్ శ్రీ జక్కుల చంద్రశేఖర్, స్థానిక ఆర్ ఎం పి డాక్టర్ జక్కుల రాజేంద్ర ప్రసాద్,సిస్టర్ రమ, ప్రకాష్,శ్రీనివాస్ మరియుఇంచార్జీ ప్రధానోపాధ్యాయులు బొల్లె చిన్నయ్య,ఉపాధ్యాయులు తాటిపెల్లి వేణుగోపాల్, కమారుద్దీన్, కూరగాయల సురేష్ పాల్గొన్నారు.

## ఎఐఎఫ్‌బి పెద్దపల్లి కన్వీనర్‌గా శ్రీనివాస్ నియామకం



**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ :** ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బి) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా కన్వీనర్‌గా కొలిపాక శ్రీనివాస్‌ను నియమించినట్లు రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజి రెడ్డి ప్రకటించారు. ఈ నియామకం తక్షణ ప్రభావంతో అమల్లోకి వచ్చినట్లు తెలిపారు.జిల్లాలో పార్టీ బలోపేతం లక్ష్యంగా ఈ నియామకం చేపట్టినట్లు పేర్కొన్నారు. మండల, పట్టణ, గ్రామ స్థాయి కమిటీలను సమన్వయం చేసి పార్టీ కార్యక్రమాలను వేగవంతం చేయాలని శ్రీనివాస్‌కు సూచించారు.సభ్యత్వ నమోదు కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై ఆందోళనలు, ప్రభుత్వ విధానాలపై స్పందన వంటి అంశాల్లో చురుకుగా వ్యవహరించాలని ఆదేశించారు. అంబటి జోజి రెడ్డి మాట్లాడుతూ సుభాష్ చంద్ర బోస్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లే దిశగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. జిల్లాలో పార్టీని మరింత విస్తరించి ప్రజలకు చేరువ చేసే కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా కొలిపాక శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తూ జిల్లాలో సంస్థాగత బలోపేతానికి కృషి చేస్తానని వెల్లడించారు.యువత, మహిళలు మరియు అన్ని వర్గాల ప్రజలను పార్టీ వైపు ఆకర్షించేలా కార్యక్రమాలు చేపడతానని పేర్కొన్నారు.కొలిపాక శ్రీనివాస్ నాయకత్వంలో పెద్దపల్లి జిల్లాలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని పార్టీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

## ఉచిత కుట్టు మిషన్ కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం మచ్చుపేట గ్రామంలో సర్పంచ్ చిలువేరి జ్యోతిలక్ష్మణ్ ఆధ్వర్యంలో గ్రామంలోని మహిళలకు ఉచిత కుట్టు మిషన్ అలీఫ్ సంస్థ ద్వారా శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ మహిళలు సొంతంగా ఉపాధి పొందేలా నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడం ద్వారా వారిని ఆర్థికంగా బలోపేతం చేయడనికి ఈ కేంద్రంలో మహిళలకు నిపుణుల ద్వారా కుట్టు మిషన్ లో శిక్షణ ఇస్తారు.శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు స్వయం ఉపాధిని పొందేందుకు ఈ కేంద్రం తోడ్పడుతుంది అని అన్నారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దొంతుల రాకేష్, వార్డు సభ్యులు కోమల్లా సంధ్య,కలవెన దేవరాజ్,బందరపు సాగర్,దుండే జ్యోతి రాణి,సి.ఎ. కోమలత, వివో రమాదేవి,ఆకుల స్రవంతి, సతీష్ ,మహిళలు అధిక పాల్గొన్నారు.

## శ్రీ స్వయంభు లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం

సర్పంచ్ మూడెడ్ల కుమారస్వామి

**ప్రజాపక్షం/ఇల్లందకుంట :** చిన్న కోమటిపల్లి గ్రామంలో ఈ నెల 28 శ్రీ స్వయంభు లక్ష్మినరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం నిర్వహించనునట్లు గ్రామ సర్పంచ్ మూడేడ్ల కుమార్ స్వామి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హుజురాబాద్ నియోజకవర్గం లోని భక్తులు అన్ని గ్రామాల ప్రజలు సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, అధికారులు, అనాధికారులు సకుటుంబ సపరి వారి సమేతంగా విచ్చేసి కళ్యాణము చూసి స్వామివారి కృపకు పాత్రులు కాగలరని సర్పంచ్ కుమార్ స్వామి.

## మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** పెద్దపల్లి పట్టణంలో మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వారి నివాసంలో వైభవంగా వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సామాజిక సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన పార్టీ నాయకులు గవర్నమెంట్ హాస్పిటల్‌లో రోగులకు ఉదయం టిఫిన్ పంపిణీ చేశారు.అలాగే రక్తదాన శిబిరాన్ని నిర్వహించి అనేక మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.మధ్యాహ్నం పేదలకు అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపెల్లి జిల్లా గ్రంథాలయం మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్, పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్ కుమార్, కౌన్సిలర్ వెన్నం రవీందర్ సుజాత, జిల్లా బీఆర్ఎస్వీ అధ్యక్షుడు కొయ్యడ సతీష్ గౌడ్, సయ్యద్ మొబీన్, మహ్మద్ జహీర్, సాబీర్ ఖాన్, మాజీ ఎంపీపీలు సంపత్ యాదవ్, స్రవంతి మోహన్‌రావు, మండల అధ్యక్షుడు మర్కు లక్ష్మణ్, జూపల్లి సందీప్ రావు, బోయిని రాజమల్లు, సుల్తానాబాద్ పట్టణ అధ్యక్షుడు పారుపల్లి గుణపతి, సర్పంచులు ఓజా సంపత్, బోయిన్ శ్రీనివాస్, భూమేష్, యాదగిరి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ నాయకులు

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం జిల్లాలపల్లి గ్రామంలో బుధవారం జరిగిన ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు అల్లం మధునమ్మవెంకన్న కుమారుడు రాకేష్అపర్ణ వివాహ శుభకార్యములకు హాజరై నూతనవధూవరులను ఆశీర్వదించిన ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ అధ్యక్షుడు అల్లం కుమారస్వామి వారి వెంట గ్రామశాఖ అధ్యక్షులు పర్శ ఓదెలు,గ్రామ శాఖ ఉపాధ్యక్షులు సోమిశెట్టి శ్రీనివాస్, ఏఎంసి డైరెక్టర్ జాగరి సమ్మయ్య, వార్డు సభ్యులు అల్లం శేఖర్,జిల్లాలపల్లి సర్పంచ్ గడ్డం రాజేశం, పెట్టం స్వామీ,పెద్దిరాయసమ్మయ్య,పన్నాల సురేష్,అల్లం జగన్, పర్శ సాయిలు,అల్లం నరేష్,గుడివేనక ప్రసాద్ ,కొక్కు రాజేశం,కోట శ్రీనివాస్,బగ్గని స్వామి, గొర్రె పోచం చొప్పరి శ్రీకాంత్ పాల్గొన్నారు.

## లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

**ప్రజాపక్షం/రాయికల్ :** రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరిపించుటకు ధర్మకర్తలు శ్రీ చెన్నమనేని విష్ణువర్ధన్,వంశీవర్ధన్ సారధ్యంలో ఏర్పాట్లు పూర్తయినట్లు అర్చకులు మరింగంటి రామకృష్ణాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ 26 వ తేదీ నుండి మార్చి 05 వ తేది వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆయన అన్నారు.28 వ తేదీ శనివారం రోజున శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం, మహా అన్నదానం, మార్చి 4 బుధవారం రోజున స్వామివారి రథోత్సవం, జాతర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని నిర్వాహకులు తెలిపారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు



**ప్రజాపక్షం/వీర్నపల్లి :** మద్యం సేవించి వాహనాలు నడపడం, రోడ్డు భద్రత నియమాలు పాటించకపోవడం వంటి చర్యలపై కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని వీర్నపల్లి ఎస్ఐ వేముల లక్ష్మణ్ అన్నారు. అరైవ్ అలైవ్ కార్యక్రమం లో బుధవారం మండల శివారు ప్రాంతంలో విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి జరిమానాలు విధించినట్లు ఎస్ఐ తెలిపారు. ప్రతి ఒక్కరు బాధ్యతయుతంగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, హెల్మెట్, సీటుబెల్టు ధరించి విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని సూచించారు.

## సానిటేషన్ సిబ్బందికి సన్మానం

**ప్రజాపక్షం/భీమ్‌గల్:** మున్సిపల్ కార్యాలయ సానిటేషన్ సిబ్బందిని బుధవారం మున్సిపల్ చైర్మన్ బోదిరే నాగమణి, వైస్‌చైర్మన్ సంటి లత సన్మానంచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సిబ్బంది అందజేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. సిబ్బంది కొత్త పాలకవర్గంతో కలిసి సమన్వయంతో కలిసి పని చేయాలని కోరారు. సిబ్బంది అం రిని శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ గంగాధర్, స్వామి, నర్సింహ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ పరీక్షలు

**ప్రజాపక్షం/బోధన్ :** ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం మొదలయ్యాయి. బోధన్ డి విజన్ పరిధిలో 12పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఇంటర్మీడియట్ విద్యశాఖ అధికారులు తెలిపారు. అందులో బోధన్ పట్టణ పరిధిలో 9, రెంజల్ మండలంలో ఒకటి, కోటగిరి మండలంలో ఒకటి, వర్ని మండలంలో ఒకటి పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. బోధన్ పట్టణంలోని 9పరీక్ష కేంద్రాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలలో 3636మంది పరీక్షలు రాయనుండగా, మొదటి రోజు తెలుగు పరీక్షకు 3,503 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని, 133మంది విద్యార్థులు హాజరు కాలేరని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

## వరద కాలువ గండి నిర్మాణ పనుల పరిశీలన



**ప్రజాపక్షం/మోర్తాడ్ :** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని గాండ్లపేట్ వద్ద ఇందిరమ్మ కాలువ గండి నిర్మాణ పనుల పురోగతిని నీటిపారుదల శాఖ జగిత్యాల యూనిట్ ముఖ్య ఇంజనీర్ సుమతీ దేవి పరిశీలించారు. పనులను నాణ్యతతో త్వరితగతిన నిర్మించాలని సుమతీ దేవి సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కార్య నిర్వహక ఇంజనీర్ లాల్ సింగ్, ఇందిరమ్మ కాలువ, ఉప కార్య నిర్వహక ఇంజనీర్ గణేష్, సహాయ ఇంజనీర్ రాము, ఎస్ఎల్ఎన్ఎస్ సంస్థ ప్రతినిధి చందు, మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** మండల కేంద్రంతో పాటు రా చర్లబొప్పాపూర్ గ్రామాలలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు గృహప్రవేశం చేయగా ఎఎంసీ చైర్మన్ షేక్ సాబేర బేగం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మండల అధికారులు ఎమ్మార్వో సుజాత, ఎంపీడీఓ సత్తయ్యలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట సర్పం చ్ ఎలగందుల నర్సింహులు, బొప్పాపూర్ సర్పంచ్ గీతాంజలిరెడ్డి, ఉపసర్పంచ్‌లు బందారపు బాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, హరిదాస్‌నగర్ సర్పంచ్ నాగరాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకులు వంగ గిరిధర్‌రెడ్డి, చెన్నిబాబు, షేక్ గౌస్, ఏఎంసీ డైరెక్టర్లు శ్రీనివాస్, క్రిష్ణరెడ్డి, వార్డుమెంబర్లు, గుర్రాల రాజిరెడ్డి, రాములు, బుచ్చ గౌడ్, శ్రీనివాస్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడలో నెలాఖరు వరకు నిషేధాజ్ఞలు అమలులోకి

**ప్రజాపక్షం/ వేములవాడ :** వేములవాడ పట్టణంలో ప్రజా శాంతి, భద్రతలను పరిరక్షించేందుకు పోలీసులు కఠిన నిర్ణయం తీసుకున్నారు. పోలీస్ చట్టం1861, రూల్ 30 ప్రకారం పట్టణ పరిధిలో నిషేధాజ్ఞలను విధిస్తున్నట్లు వేములవాడ టౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రకటించారు. ఈ ఉత్తర్వులు ఫిబ్రవరి 28వ రాత్రి వరకు అమల్లో ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. పట్టణ పరిధిలో ఎటువంటి ప్రజా సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, ఆందోళన కార్యక్రమాలను ముందస్తు అనుమతి లేకుండా నిర్వహించకూడదు. బహిరంగ ప్రదేశాల్లో కత్తులు, ఈటెలు, కర్రలు, పేలుడు పదార్థాలు లేదా ఇతర ప్రమాదకర ఆయుధాలను తీసుకెళ్లడంపై నిషేధం విధించారు. అలాగే, ప్రజలకు అసౌకర్యం కలిగించేలా రహదారులపై గుంపులుగా చేరడం, రాళ్లు లేదా విసిరే వస్తువులను సేకరించడం, అనుమతి లేకుండా లౌడ్ స్పీకర్లు, డీజేలను వాడటాన్ని పూర్తిగా నిషేధించారు. ఈ ఆంక్షల నుంచి విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు, సైనిక సిబ్బంది, హోం గార్డులకు మినహాయింపు ఉంటుంది. అలాగే, అత్యవసరమైన అంత్యక్రియల ఊరేగింపులకు ఈ ఆదేశాలు వర్తించవు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలంతా శాంతి భద్రతలను కాపాడేందుకు పోలీస్ శాఖకు సహకరించాలని అధికారులు కోరారు.

## శ్రీ చక్రేశ్వర ఆలయ హుండి లెక్కింపు



**ప్రజాపక్షం/బోధన్ :** బోధన్ పట్టణంలోని శ్రీ చక్రేశ్వర శివ మందిరం ఆలయ హుండి లెక్కింపు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్స్‌స్పెక్టర్ కమల పర్యవేక్షణలో పారదర్శకంగా నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా మూడు నెలలకు సంబంధించిన హుండిలోని డబ్బులు లెక్క పెట్టగా రూ. 2,82,950 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారు లు తెలిపారు. మహా శివరాత్రి వేడుకల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఈ హుండి లెక్కింపు కార్యక్రమంలో శ్రీ చక్రేశ్వర ఆలయ ఈఓ రాములు, బోధన్ పట్టణ ఆర్యవైశ్య సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు పట్వారీ, ఆలయ అర్చకులు గణేష్ శర్మ, మహేష్ పాటక్, సిబ్బంది సుధాకర్, చంద్రకళ, పుష్ప, భక్తులు పాల్గొన్నారు.

## జిల్లాలో ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** జిల్లా వ్యాప్తంగా బుధవారం ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు అత్యంత కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి.పరీక్షల తొలిరోజు జిల్లాలో 95.70 శాతం హాజరు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.నిర్మల్ పట్టనంలోని శాంతినగర్‌లో గల ప్రభుత్వ జూనియర్ బాలబాలికల కళాశాలలోని పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆమె పరీక్ష గదులను సందర్శించి,విద్యార్థులకు కల్పించిన వసతులను పర్యవేక్షించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ,విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనూకాకుండా,ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ముఖ్యంగా వెబ్ కాస్టింగ్ ద్వారా నిరంతరం నిఘా ఉంచాలని సూచిస్తూ,పరీక్ష కేంద్రాల్లోని సీసీ కెమెరాల పనితీరును స్వయంగా పరిశీలించారు.జిల్లాలో మొదటి రోజు పరీక్షకు మొత్తం 7,076 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా,వారిలో 6,772 మంది (95.70 శాతం) హాజరయ్యారు.వివిధ కారణాల వల్ల 304 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు ధృవీకరించారు.కలెక్టర్ వెంట జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఐఈఓ) పరుశురాం తహసీల్దార్ రాజు,అధికారులు,తదితరులు ఉన్నారు.

## పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



**ప్రజాపక్షం/సోన్ :** మండలంలోని పలు గ్రామాల్లో అకాల వర్షాలు, వడగళ్ల వర్షంవల్ల నష్టపోయిన మొక్క జొన్న పంటను బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పరిశీలించారు. మండలంలోని సోన్,కూచన్ పల్లి, బొప్పారం, న్యూ వెల్మల్ గ్రామాల్లో నేలకొరిగిన మొక్కజొన్న పంటను పరిశీలించారు.సుమారు ఒక్క సోన్ మండలంలోనే 1000 ఎకరాల పైనే పంట నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతీసారి నివేదికలు తెప్పించుకోవడం తప్ప ఇప్పటి వరకు ఏ ఒక్క రైతుకు కూడా నష్ట పరిహారం చెల్లించలేదని అన్నారు.తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం నష్టపోయిన ప్రతీ రైతును ఆదుకునేలా చర్యలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు సరికెల గంగన్న,మండల అధ్యక్షుడు మార గంగారెడ్డి,న్యూ వెల్మల్ సర్పంచ్ రాచకొండ సాగర్, నర్సయ్య, శ్రీనివాస్, సంతోష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షలకు నిషేధాజ్ఞలు



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** ఫిబ్రవరి 25 నుండి మార్చి 18 వరకు జరుగుతున్న ఇంటర్‌మీడియట్ పబ్లిక్ పరీక్షలకు కొన్ని నిషేధాజ్ఞలు ఉన్నాయని ఎల్లారెడ్డిపేట ఎస్ఐ రాహుల్‌రెడ్డి, ఎంఆర్ఓ సుజాత అన్నారు. బుధవారం స్థానిక రాచర్ల జూనియర్ కళాశాల, ప్రభుత్వ కళాశాలలో నిర్వహిస్తున్న పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్ష కేంద్రం చుట్టూ 200 మీటర్ల పరిధిలో నిషేధాజ్ఞలు ఉంటాయని, అనధికార వ్యక్తులు, కోచింగ్ సెంటర్ నిర్వాహకులు, తల్లిదండ్రులు, మొబైల్ ద్వారా పరీక్షలకు సహాయం చేసే వ్యక్తులు సెంటర్ పరిసరాలలో తిరగరాదని, జిరాక్స్ షాపులు మూసివేయాలని సూచించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో ఎలాంటి ఒత్తిడి లోనుకాకుండా పరీక్షలు రాయాలని అన్నారు.

## కౌన్సిలర్‌గా గెలిచిన ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షునికి జిల్లా అధ్యక్షుడి సన్మానం



**ప్రజాపక్షం/మెట్ పల్లి :** మున్సిపల్ ఎన్నికల్లో 20వ వార్డు నుంచి కౌన్సిలర్ గా గెలిచిన టీ యు డబ్ల్యూ జే ఐజేయు మెట్ పల్లి గౌరవాధ్యక్షులు మాసుల ప్రవీణ్ ను టీయూడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షులు చీటి శ్రీనివాస్ రావు బుధవారం రోజున ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే ఐజేయు మెట్ పల్లి అధ్యక్షుడు డా: బూరం సంజీవ్, జనరల్ సెక్రెటరీ మహమ్మద్ అజీమ్, ఉపాధ్యక్షులు జంగం విజయ్, అఫ్రోజ్ , జిల్లా కార్యవర్గ సభ్యులు సాజిద్ పాషా, బాసెట్టి హరీష్, గౌరవ సలహాదారులు దాసం కిషన్ ,క్యాషియర్ మక్సూద్, జాయింట్ సెక్రెటరీ పుంద్ర శశికాంత్ రెడ్డి, పింజర్ శివ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎండి సమీయుద్దీన్, కార్యవర్గ సభ్యులు పొనగాని మహేందర్, కుర్ర రాజేందర్ ,యానం రాకేష్ ,రఫీ ఉల్లా, సోహెల్ , హైమద్, ముత్యాల రమేష్ , ఓంకారి శ్రీనివాస్,బొల్లం రాజు,మాజీ అధ్యక్షుడు ఆగ సురేష్ సభ్యులు ఆదిల్ పాషా, రమణ, ఏసమేని గణేష్, ఎండి అభిద్, శశి కుమారు,అమ్ముల ప్రవీణ్ ,తదితరులు పాల్గొన్నారు.

## బహుమతుల ప్రదానం



**ప్రజాపక్షం/చందుర్తి :** జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని మండల ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల అసోషియేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన క్విజ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు మండల విద్యాధికారి వినయ్ కుమార్ బహుమతులు అందజేశారు. పర్యావరణం, ప్రకృతి, శాస్త్రీయ అంశాలపై సాగిన పోటీలలో ఎంపీపీఎస్ బండపల్లి ప్రథమ బహుమతి , ఎంపీపీఎస్ తిమ్మాపూర్ ద్వితీయ బహుమతి, పీఎంశ్రీ ఎంపీపీఎస్ చందుర్తి తృతీయ బహుమతి పొందారు.ఈ కార్యక్రమం లో చందుర్తి , సనుగుల, మూడపల్లి, రుద్రంగి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు,ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల అసోషియేషన్ ప్రతినిధులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

**ప్రజాపక్షం/దిలావర్‌పూర్ :** దిలావర్‌పూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి.మొదటి రోజు జరిగిన తెలుగు, హిందీ, జి.ఎఫ్.సి పరీక్షలకు మొత్తం 266 మంది విద్యార్థులకు గాను 260 మంది హాజరయ్యారని, ఆరుగురు గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ మాలేపు కృష్ణ,డిపార్ట్‌మెంటల్ అధికారి యు.సురేఖ తెలిపారు.పరీక్షా కేంద్రాన్ని డి.ఈ.సి సభ్యులు కె.శంకర్ ఆకస్మికంగా తనిఖీ చేసి,విద్యార్థులకు కల్పించిన మౌలిక వసతులపై సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మార్వో అజీస్ అహ్మద్ ఖాన్,ఎస్సై పి.రవీందర్ కేంద్ర సందర్శించి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. పరీక్షలు నిబంధనల ప్రకారం పారదర్శకంగా జరుగుతున్నాయని

## మెరుగైన వైద్యానికి ఉమ్మడి సమన్వయం



**ప్రజాపక్షం / నస్పూర్ :** ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల సమన్వయంతోనే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ అరుణశ్రీ, డాక్టర్ అనిల్ పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం వైద్య విద్యార్థులకు నిర్వహించిన శిక్షణలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రజారోగ్య పరిరక్షణలో ప్రభుత్వంతో పాటు ప్రైవేటు ఆసుపత్రులు కలిసి పనిచేయడం వల్ల వ్యాధుల నియంత్రణ సులభమవుతుందని, ప్రైవేటు ఆసుపత్రుల్లో నమోదయ్యే కేసుల వివరాలను ప్రభుత్వానికి నివేదించడం ద్వారా అంటువ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. మాతా శిశు సంరక్షణ, టీకాల ప్రాముఖ్యత, అసంక్రమణ వ్యాధుల గుర్తింపులో రెండు విభాగాలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ అశోక్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, సిహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, టీవీ సమన్వయకర్త సురేందర్ పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం

**ప్రజాపక్షం / మందమర్రి :** మందమర్రి పట్టణంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. బుధవారం మార్కెట్ ఏరియాలోని పాలచెట్టు సమీపంలో బివిఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ సహకారంతో కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్ర ముఖ కంటి వైద్యుడు డాక్టర్ బివి రఘునందన్ రోగులకు పరీక్షలు నిర్వహించారు. పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో శిబిరాన్ని చేపట్టినట్లు తెలిపారు. శస్త్రచికిత్సలు అవసరమైన రోగులకు డాక్టర్ రఘునందన్ ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం పట్ల స్థా నిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపి సంఘం ప్రతినిధులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

## కమ్యూనిస్టు వందేళ్ల సభ విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఈ నెల 27న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞానకేంద్రంలో; కమ్యూనిస్ట్ పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సభను జయప్రదం చేయాలని గోడప్రతులను విడుదల చేశారు. ఖానాపూర్ పట్టణం విశ్రాంతి భవనంలో ఏర్పాటుచేసిన సమావేశంలో న్యూడెమోక్రసీ ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేష్ మాట్లాడుతూ భారతదేశం ఒక అర్థ వలస,అర్థ భూస్వామ్య వ్యవస్థ అని, దీనిని కూల్చివేసి నూతన వ్యవస్థ ఏర్పాటు చేయడం కోసం విప్లవ పంథా మార్గంలో కమ్యూనిస్ట్ నాయకులు అందరూ కలిసి నూతన నాయకత్వం ఏర్పాటు చేసుకోవడానికి ఒక మహాసభ ఏర్పాటు చేశారని అలాంటి ఒక గొప్ప మహాసభ ఏర్పడి వందేళ్లు పూర్తి అయిన సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించే కమ్యూనిస్టు వందేళ్ల సభను విజయ



వంతం చేయాలని, ఈ సభకు ప్రతి ఒక్క రు హాజరుకావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం లింగన్న, డివిజన్ నాయకులు ఆడేపు గణేష్, జిల్లా అధ్యక్షురాలు మల్లక్క, ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు గోనే స్వామి,ఉపాలి, గూట్ల ప్రసాద్,కుడుదల రాజేష్,మాన్క శ్రీనివాస్ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ఇస్తారి పాల్గొన్నారు.

## అక్రమ మద్యం విక్రయాలపై అధికారుల నిర్లక్ష్యం



**ప్రజాపక్షం / సిర్పూర్ టి :** సిర్పూర్ టి మండలంలో అక్రమ బెల్ట్ షాపుల నిర్వహణపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు అధికారిక మద్యం దుకాణాలపై తూతూమంత్రంగా తనిఖీలు నిర్వహిస్తూ, గల్లీల్లో జోరుగా సాగుతున్న అక్రమ విక్రయాలను పట్టించుకోవడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండల పరిధిలోని పలు గ్రామాల్లో కిరాణా దుకాణాల వెనుక గదుల్లో మద్యం విక్రయాలు బహిరంగ రహస్యంగా జరుగుతున్నాయి. వైన్స్ షాపుల నుంచే మద్యం భారీగా బయటకు వెళ్లి చిన్నచిన్న బెల్ట్ షాపులకు చేరుతున్నా, ఆ సరఫరా గొలుసును గుర్తించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారిక దుకాణాల్లో తనిఖీలు చేసి అన్నీ సక్రమంగా ఉన్నాయని ప్రకటిస్తున్న అధికారులు, బెల్ట్ షాపులకు మద్యం ఎక్కడి నుంచి వస్తుందనే అంశంపై నోరు మెదపకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అక్రమ మద్యం విక్రయాల వల్ల యువత వ్యసనాల బారిన పడుతుండటంతో కుటుంబాల్లో కలహాలు పెరిగి మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో అవాంఛనీయ సంఘటనలు జరుగుతూ శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా పాఠశాలల సమీపంలో కూడా మద్యం సులభంగా లభిస్తుండటంపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు కేవలం పత్రికా ప్రకటనలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి బెల్ట్ షాపులను పూర్తిగా నిర్మూలించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/మామడ :** మామడ మండల కేంద్రంలో బిజెఎల్పి నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు.ఈ మేరకు మామడ గ్రామంలో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు.రూ.10 లక్షలతో ఎస్.హెచ్.జి (వివో) భవన నిర్మాణానికి, రూ.10 లక్షలతో ఎస్.హెచ్.జి (వి.ఓ) వర్క్ షెడ్ నిర్మాణానికి బిజెఎల్పి నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శంకుస్థాపన చేశారు.అనంతరం మండలంలో అకాల వర్షాలు, వడగళ్ల వర్షాల కారణంగా ఎంత మేరకు పంట నష్టం వాటిల్లిందని అధికారులను అడిగి తెలుసుకున్నారు.పూర్తి స్థాయిలో నివేదిక రూపొందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ



సర్పంచ్ చంద్రకళ సురేందర్,ఉప సర్పంచ్ ప్రవీణ్,సీనియర్ నాయకులు బావు రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్ర రాజారెడ్డి,మండల అధ్యక్షుడు రంజిత్,తోపాటు మండల బిజెపి నాయకులు,కార్యకర్తలు మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వార్డుల్లో వీధి దీపాలు, నీటి కనెక్షన్లు కల్పించాలి



**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** పట్టణంలోని 30 వార్డుల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు మంచినీటి ఇంటర్ కనెక్షన్లు మంజూరు చేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ అనిత కోరారు. బుధవారం కాగజ్ నగర్ మున్సిపల్ కార్యాలయంలో బిఆర్ఎస్ కౌన్సిలర్లతో కలిసి మున్సిపల్ కమిషనర్ తిరుపతికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ పట్టణంలోని అనేక కాలనీల్లో వీధి దీపాలు లేక రాత్రి వేళ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా సక్రమంగా లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని వివరించారు. అన్ని వార్డుల్లో వీధి లైట్లు ఏర్పాటు చేసి, అవసరమైన చోట్ల కొత్త నీటి పైపులు వేసి ఇంటర్ కనెక్షన్లు కల్పించాలని విన్నవించారు. వినతిపత్రం స్వీకరించిన కమిషనర్ సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ కౌన్సిలర్లు వలీ భాయ్, వసీం అహ్మద్, నంది సాయి, మాణిక్య రావు పాల్గొన్నారు.

## పసి బిడ్డను చంపిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలి

**ప్రజాపక్షం/బైంసా :** బైంసా పట్టణంలోని ఐలమ్మ గద్దె వద్ద ఎస్‌సి.ఎస్‌టి,బిసి రజక సంఘాల ఆధ్వర్యంలో చాకలి పసిబిడ్డ ను చంపిన దుర్మారులను కఠినంగా శిక్షించాలని ఫ్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బిసి సంఘం బైంసా డివిజన్ అధ్యక్షుడు సుంకెట మహేష్ బాబు మాట్లాడుతూ దేవుడి దర్శనానికి వెళ్తే, నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో కీర్తన కుటుంబంపై దాడి చేసి 2నెలల పసిపాపను హత్య చేసిన పెత్తందారులందరినీ వెంటనే అరెస్ట్ చేయాలి. వారిపై హత్యా నేరం కేసు పెట్టి కఠినంగా శిక్షించాలి. సర్పంచ్ ను వెంటనే పదవి నుండి తొలగించాలి. కేసును వేగంగా విచారణ చేసి కఠిన శిక్షలు విధించాలి. బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం,ప్రభుత్వం భద్రత కల్పించాలి.ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాం.ఈ కార్యక్రమంలో బిసి సంఘం నాయకులు గంగప్రసాద్,బైంసా పట్టణ రజక సంఘం నాయకులు సుంకెట శ్రీనివాస్,సాయినాథ్,ఎస్సి సంఘం నాయకులు యశ్వంత్ బాన్సోడే,ముత్యం,తదితరులు పాల్గొన్నారు.

## సిర్పూర్ టిలో ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



**ప్రజాపక్షం / సిర్పూర్ టి :** మండల కేంద్రంలోని పరీక్షా కేంద్రంలో బుధవారం ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సెంటర్ కోడ్ 32003 కేంద్రంలో మొదటి రోజు పరీక్షలు సజావుగా సాగాయి. జనరల్ విభాగంలో 312 మంది విద్యార్థులకు గాను 311 మంది హాజరయ్యారు. ఒకరు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 36 మందికి గాను 35 మంది పరీక్ష రాశారు. ఇక్కడ కూడా ఒక విద్యార్థి గైర్హాజరైనట్లు అధికారులు వెల్లడించారు. రెండు విభాగాల్లో కలిపి మొత్తం 348 మంది విద్యార్థులకు 346 మంది హాజరు కాగా.. ఇద్దరు విద్యార్థులు పరీక్షకు రాలేదు. పరీక్షల సందర్భంగా కేంద్రం వద్ద కట్టుదిట్టమైన పర్యవేక్షణతో పాటు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో మొదటి రోజు పరీక్షలు విజయవంతంగా పూర్తయ్యాయి.

## గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ మండలం లోని సంగ్వి పల్లె గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజకు ముఖ్య అతిథులుగా బోథ్ నియోజకవర్గం ఇంచార్జి ఆడే గజేందర్, బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్ హాజరయ్యారు. తమ గ్రామానికి సంబంధించిన పలు అభివృద్ధి పనులకు సంబంధించి ఇంచార్జి ఆడే గజేందర్‌ని గ్రామస్థులు సహకారం కోరగా సానుకూలంగా స్పందించారు. కచ్చితంగా మంత్రుల సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పి.ఎ.సి.ఎస్ డైరెక్టర్ చట్ల ఉమేష్,సొనల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు వినోద్,బోథ్ సర్పంచ్ అన్నపూర్ణ మహేందర్,చింతల బోరి సర్పంచ్ శ్రీరామ్,ఘనపూర్ సర్పంచ్ రామ దేవి,కోట సర్పంచ్ పూజ సంగ్రామ్,బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతరెడ్డి,నాయకులు రాజురెడ్డి,రవి,శ్రీనివాస్ రెడ్డి,అచ్చుత్‌రెడ్డి,జగదీశ్వర్ రెడ్డి,శ్రీనివాస్,రాజు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రయోగాత్మక బోధనతో విద్యార్థుల్లో చెరగని ముద్ర



**ప్రజాపక్షం / దండేపల్లి :** విద్యార్థులకు ప్రయోగాల ద్వారా బోధించడం వల్ల పాఠ్యాంశాలు వారి మనస్సులో బలంగా ముద్రితమవుతాయని దండేపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సంగర్స్ రాజేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం తాళ్లపేట ఉన్నత పాఠశాలలో జన్నారం, లక్సెట్టిపేట, దండేపల్లి మండలాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం పుస్తకాల్లోని చదవడం కంటే, ప్రయోగాత్మకంగా చూసినప్పుడు విద్యార్థులకు విషయం కళ్లకు కట్టినట్లు అర్థమవుతుందని వివరించారు. ప్రయోగాల ద్వారా నేర్చుకున్న అంశాలను విద్యార్థులు త్వరగా గ్రహించడమే కాకుండా, చాలా కాలం పాటు గుర్తుంచుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో తాళ్లపేట ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్, రిసోర్స్ పర్సన్లు మనోహర్, పాత రమేష్, సిఆర్పి గరిగే నరసయ్య, కాంప్లెక్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

డిఇఒ భోజన్న



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** మార్చి 14 నుండి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక సెయింట్ థామస్ హైస్కూల్‌లో నిర్వహించిన చీఫ్ సూపరింటెండెట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారుల ఓరియంటేషన్ తరగతులకు ఆయన హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులతో పాటు అధిఇకారులకు కూడా సెల్‌ఫోన్లు అనుమతి లేదని స్పష్టం చేశారు. విధుల్లో ఉన్న ప్రతి ఒక్కరూ ఐడెంటిటీ కార్డులు ధరించాలని, అనధికార వ్యక్తులను అనుమతతించకూడదని సూచించారు.ప్రశ్నపత్రాలను పోలీస్ స్టేషన్ నుండి తరలించేటప్పుడు,సమాధాన పత్రాలను పోస్ట్ ఆఫీస్ కు చేరవేసేటప్పుడు కచ్చితంగా పోలీస్ ఎస్కార్ట్ ఉండాలని ఆదేశించారు.విద్యార్థుల కోసం పరీక్షా కేంద్రాల్లో తాగునీరు,వెలుతు రు, ఫ్యాన్లు టాయిలెట్ సౌకర్యాలు కల్పించాల ని, దివ్యాంగులకు గ్రౌండ్ ఫ్లోర్‌లోనే గదులు కే టాయించాలని సూచించారు.ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎసిపి ముడారపు పరమేశ్వర్, జిల్లాలోని 47 కేంద్రాల అధికారులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్



**పజాపక్షం /సంగారెడ్డి :** ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణను పర్యవేక్షించే క్రమంలో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య బుదవారం పరీక్షల తొలి రోజున జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, షాహిన్ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు వివరాలను ఆరా తీశారు. నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలోనే ప్రశ్నా పత్రాలను తెరిచారా లేదా అన్నది పరిశీలించారు. సిసిటీవీ నిఘా మధ్య ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పరీక్షలు నిర్వహస్తున్నారా అనే విషయాన్ని పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి సదుపాయం ,మెడికల్ కేర్‌తో ఎఎస్ఎం అందుబాటులో ఉండటం ,టాయిలెట్ వసతులు వంటి మౌళిక సదుపాయాలను కూడా పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షలు పూర్తైన వెంటనే ఆన్సర్ షీట్లను తగిన బందోబస్తు మధ్య నిర్ధేశిత కేంద్రాలకు సురక్షితంగా తరలించాలని సూచించారు. ఎలాంటి కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పూర్తి పారదర్శకతతో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ తనిఖీలో సంబంధిత పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ , అధికారులు పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి

అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జిల్లాలో నిర్వహించే పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సంబంధిత జిల్లా అధికారులతో కలిసి అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షలు వచ్చే నెల (మార్చి) 14 వ తేదీ నుంచి ఏప్రిల్ 15వ తేదీ వరకు నిర్వహించ నున్నారని తెలిపారు. 7,317 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాసేందుకు 34 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. పరీక్షా కేంద్రాల వద్ద పరీక్ష జవాబు పత్రాలను ప్రశ్నపత్రాలను తరలించే సమయంలో పటిష్ఠ బందోబస్తు చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పరీక్ష జరుగుతున్నంత సేపు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. విద్యార్థుల సౌకర్యార్థం పరీక్ష సమయం అనుకూలంగా తగినంత బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులకు ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని, పరీక్షలు కొనసాగే సమయంలో సమీప జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని సూచించారు. ఆయా పరిధిలో ఉన్న మున్సిపల్ కమిషనర్లు, ఎంపీ డీఓలు పరీక్ష కేంద్రాలను ముందస్తుగా పరిశీలించి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అలాగే ప్రతి పరీక్ష కేంద్రంలో వసతులను ఏర్పాటు చేయాలని, ఏఎన్ఎం ను అందుబాటులో ఉంచి సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆయా ప్రదేశాల్లో వెళ్లే ఆర్టీసీ బస్సులు సమయపాలన పాటించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏఎస్పీ చంద్రయ్య, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, డీటీఓ నవీన్ కుమార్, ఆర్టీసీ, పోస్టల్, వైద్య శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు రంజాన్ తోఫా పంపిణీ



**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** కాగజ్ నగర్ పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్లో దారుల్ అన్సార్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం రంజాన్ రేషన్ కిట్లు పంపిణీ చేశారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని వివిధ వార్డుల్లో ముందస్తుగా సర్వే నిర్వహించి అర్హులైన 120 మందిని గుర్తించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి ముఫాఖం అహ్మద్ మాట్లాడుతూ వితంతువులు, వికలాంగులు, కూలీలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో సేవా కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రతి కిట్‌లో బియ్యం, పప్పు, చక్కెర, నూనె, గోధుమ పిండి, మసాలా దినుసులు సహా వివిధ నిత్యావసర సరుకులను అందజేశారు. సరుకులతో పాటు 120 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 200 రూపాయల నగదు, మరో 150 మంది సభ్యులకు 300 రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. పండుగ సమయంలో పేద కుటుంబాలకు ఈ సాయం ఎంతో ఊరట ఇస్తుందని, భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ హాఫీజ్ రియాజ్, కోశాధికారి రహీం మల్నాస్, అబ్దుల్ షకీర్, ట్రస్టు సభ్యులు షేక్ నసీర్, ముఫీద్ అలీ, అబ్దుల్ ముఖీమ్, షేక్ ముస్తహిద్ అలీ, ఖాజా సలావుద్దీన్, ముక్రం అహ్మద్, మొహమ్మద్ అలీం పాల్గొన్నారు

# రాయి కోత కార్మికులకు సబ్సిడీపై టూల్ కిట్స్

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లాలోని తుర్క కాశ ముస్లిం సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలు ఆర్థికంగా స్థిరపడేందుకు తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ అద్భుతమైన అవకాశం కల్పించింది.2025–26 ఆర్థిక సంవత్సరానికి అర్హులైన లబ్ధిదారులకు రూ.60,000 విలువైన ఉపకరణాలను పూర్తి సబ్సిడీతో అందించనున్నట్లు జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమాధికారి ఆర్.మోహన్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ ప్యాకేజీలో భాగంగా రూ.10,000 విలువైన టూల్ కిట్, రూ.50,000 విలువైన జనరేటర్‌ను ఉచితంగా అందజేస్తారు.అర్హత కలిగిన వారు ఫిబ్రవరి 20వ తేదీ ఉదయం 10.30 గంటల నుండి మార్చి 1వ తేదీ అర్ధరాత్రి వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుదారులు 21 నుండి 55 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉండాలని, ఆధార్ కార్డు, ఫుడ్ సెక్యూరిటీ కార్డు, తుర్క కాశ కమ్యునిటీ సర్టిఫికేట్ కలిగి ఉండాలని అధికారులు స్పష్టం చేశారు.గత ఐదేళ్లలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ నుండి ఎటువంటి లబ్ధిపొందని వారు మాత్రమే దీనికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ప్రతిని సంబంధిత ఎంపిడిఒ లేదా మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఉండే కమిటీ ద్వారా లబ్ధిదారుల ఎంపిక,ఒకవేళ దరఖాస్తులు పరిమితికి మించి వస్తే లాటరీ విధానాన్ని అనుసరిస్తామని ప్రకటించారు.ఈ పథకానికి సంబంధించిన పూర్తి వివరాల కోసం నిర్మల్ కొత్త కలెక్టరేట్ కాంప్లెక్స్ (ఐడిఒసి)లోని మైనారిటీ సంక్షేమ కార్యాలయంలో సంప్రదించాలని అధికారులు సూచించారు.

# అన్నదాత సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తాం

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**ప్రజాపక్షం/గంగాధర :** చొప్పదండి నియోజకవర్గంలో రైతులు సాగు చేసిన యాసంగి పంటలు ఎండిపోకుండా చివరి మడి వరకు సాగునీరు కాపాడుకుంటామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. బుధవారం గాయిత్రి పంపు హౌస్ నుంచి వరద కాలువకు నీటి విడుదల చేయడానికి సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడినట్లు ఆయన తెలిపారు. రెండు రోజుల్లో వరద కాలువ నీటిని విడుదల చేసి పంటలకు సాగునీరు అందిస్తామని అధికారులు ఎమ్మెల్యేకు తెలిపారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రతిపక్షాల మాటలు నమ్మి రైతులెవ్వరు ఆందోళన చెందవద్దని, చొప్పదండి నియోజకవర్గంలోని ప్రతి గంటకు సాగునీరు అందిస్తామన్నారు. నియోజకవర్గాన్ని వాటర్ హబ్‌గా మార్చుతామని తెలిపారు.

# నిర్మల్ జిల్లాలో ప్రశాంతంంగా ఇంటర్ పరీక్షలు

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లావ్యాప్తంగా బుధవారం ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు అత్యంత కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి మొదటి రోజు జరిగిన ఐపిఇ థియరీ పరీక్షలకు సంబంధించిన వివరాలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి పరుశురామ్ అధికారికంగా వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన వివిధ పరీక్షా కేంద్రాల్లో మొత్తం 7,076 మంది విద్యార్థులకు 6,772 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.వివిధ కారణాల వల్ల 304 మంది విద్యార్థులు ఈ మొదటి రోజు పరీక్షకు గైర్హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు.పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవకతవకలు జరగకుండా జిల్లా యంత్రాంగం అన్ని జాగ్రత్తలు తీసుకుంది.అన్ని కేంద్రాల వద్ద గట్టి పోలీస్ బందోబస్తుతో పాటు 144 సెక్షన్ అమలు చేశారు.విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులను పర్యవేక్షించామని మిగిలిన పరీక్షలు కూడా ఇదే తరహాలో పారదర్శకంగా జరుగుతాయని డి.ఐ.ఇ.ఒ ధీమా వ్యక్తం చేశారు.

## క్రీడలతోనే శారీరక దృఢత్వం

జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్




**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** పుస్తక పఠనం జ్ఞానాన్ని ఇస్తే, క్రీడలు వ్యక్తిత్వ వికాసంతో పాటు శారీరక దృఢత్వానికి తోడ్పడుతాయని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఏరియాలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వార్షిక క్రీడోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిసెంబర్ నెలలో నిర్వహించిన పరుగు పందాలు, లాంగ్ జంప్, షాట్ పుట్, కబడ్డీ, వాలీబాల్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యాభ్యాసంతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని, క్రీడలు కేవలం శారీరక దృఢత్వాన్ని మాత్రమే కాకుండా క్రమశిక్షణ, జట్టు భావన, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని వివరించారు. సింగరేణి యాజమాన్యం విద్యార్థుల సమగ్రాభివృద్ధి కోసం పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, క్రీడా సామగ్రి, శిక్షణా అవకాశాలు కల్పిస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం కూడా క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి ఉన్నత విద్య, ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇస్తోందని గుర్తు చేశారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే కష్టపడే తత్వాన్ని అలవరుచుకుని తల్లిదండ్రులకు, సంస్థకు, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం. రాజేష్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులు స్వీకరించిన ఎస్‌పి




**ప్రజాపక్షం/బైంసా :** బైంసా పట్టణంలోని ఎస్‌పి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా బైంసా సబ్ డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన 6 మంది అర్జిదారుల ఫిర్యాదులను స్వీకరించి,ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించారు.ఫిర్యాదుదారుల ఎదుటే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి,బాధితులకు చట్టపరంగా అవసరమైన సహాయాన్ని వెంటనే అందించాలని సూచించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో వచ్చిన కొన్ని కుటుంబ సమస్యలపై షీ టీం సిబ్బంది ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించారు.కౌన్సిలింగ్ ద్వారా కుటుంబాలు తిరిగి కలుసుకోవడం జరిగింది.ప్రజలు నిర్మల్ వరకు రావడం కష్టంగా ఉండగా,బైంసాలోనే కౌన్సిలింగ్ కల్పించడం పై ఎస్‌పి చూపిన ఆలోచనపై బాధితులు సంతృప్తిని వ్యక్తం చేశారు.

## నల్లా కనెక్షన్ల ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతం చేయాలి



**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** అమృత్ 2.0 పథకం ద్వారా మున్సిపాలిటీలో మంజూరైన మంచినీటి నల్లా కనెక్షన్ల ఆన్‌లైన్ ప్రక్రియను వార్డుల వారీగా త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ షాహిన్ సుల్తానా, కమిషనర్ తిరుపతి ఆదేశించారు. బుధవారం కాగజ్ నగర్ మున్సిపల్ కార్యాలయంలో వార్డ్ ఆఫీసర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో వారు మాట్లాడారు. నవంబర్ 2021 తర్వాత తీసుకున్న కనెక్షన్ల వివరాలను వెంటనే నమోదు చేయాలని సూచించారు. పట్టణంలో ఇంటి పన్ను, నీటి పన్ను వసూళ్లను వంద శాతం పూర్తి చేయాలని సిబ్బందికి స్పష్టం చేశారు. బకాయిలు లేకుండా చూడాలని, పన్నుల వసూలులో అలసత్వం వహించకూడదని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.